క్లుప్తంగా

రెడ్డి బాబుకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి పూజారి రెడ్డి బాబు డాక్టరేట్ పొందారు. ఆయన ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజులు పర్యవేక్షణలో స్పెక్ట్రోస్కోపిక్ అండ్ ఎక్సైటెడ్ స్టేట్ డైనమిక్స్ ఆఫ్ అయాన్స్ డాట్ ఆల్కలి మెటల్స్ బేస్డ్ పాస్ఫేట్స్ గ్లాసెస్ ఫర్ విజిబుల్ డివైస్ డిస్ప్లే అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు

వారపుసంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చంద్రగిరి: వారపు సంతలో రైతులతోపాటు కొనుగోలుదారులకు ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలు ఆకలితో అలమటించుకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి అన్నదానం చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే 10.30 నుంచి ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: చంద్రగిరి పంచాయతీ అక్కగార్లకాలనీకి చెందిన రమేష్, ఆర్తిలకు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను ఆదివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అందజేశారు. ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి పాల్గొన్నారు.

కేకుల తయారీపై మహిళలకు శిక్షణ

తిరుపతి కల్చరల్: అఖిల భరాత మహిళా వ్యాపారవేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో అత్యధిక పోషక విలువలుగల తృణధాన్యాలతో కేకులు, కుకీస్ తయారీ విధానంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు తెలిపారు. ఎంఆర్‌పల్లిలోని బేకర్స్ బై బాన్స్‌లో సోమ, మంగళవారం శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చంద్రగిరిలో వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్

- పంచాయతీ ఎన్నికల్లో వందశాతం సీట్లు అధికార పార్టీ కైవసం
- సర్పంచ్, నాలుగు వార్డులు సైతం ఏకగ్రీవం
- అభివృద్ధి, సంక్షేమానికే స్థానిక మొగ్గు

చంద్రగిరి: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుంభి మోగించింది. సర్పంచ్‌తో పాటు నాలుగు వార్డులు వైఎస్సార్ సీపీ ఖాతాలో జమచేసుకుంది. చంద్రగిరి నియోజకవర్గంలో వివిధ కారణాలతో సర్పంచ్, నాలుగు వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆ ఐదు స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

కమ్మకండ్రిలో సంక్షేమానికి జేజేలు

రామచంద్రాపురం పంచాయతీ కమ్మకండ్రిలో సంక్షేమ పథకాలకు ప్రజలతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు జేజేలు కొట్టారు. అక్కడ సర్పంచ్‌గా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతురాలు కాకర్ల లక్ష్మమ్మ ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ వచ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అనారోగ్య కారణాలతో గతేడాది జూన్‌లో మృతి చెందారు. దీంతో సర్పంచ్ స్థానానికి ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ క్రమంలో ఆమె కోడలు కాకర్ల కావ్య నామినేషన్ దాఖలు చేశారు. ఇతర పార్టీల నుంచి నామినేషన్‌లు వేయకుండా ప్రజలు ఆమెకు మద్దతు పలకడంతో సర్పంచ్‌గా కాకర్ల కావ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.



నామినేషన్ వేస్తున్న యాగన్నగారి సుప్రియ (ఫైల్)

సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వల్లే అన్ని వర్గాల ప్రజలు తనను ఆశీర్వదించారని కావ్య తెలిపారు.

వార్డు స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీదే హవా

తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఉన్న యాగన్నగారి జమున గతేడాది అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఈ క్రమంలో 8వ వార్డు ఉప ఎన్నిక నిర్వహించగా ఆమె కుమార్తె యాగన్న గారి సుప్రియ నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా పాడిపేటకు చెందిన వార్డు సభ్యురాలు పాలెం రెడ్డమ్మ మృతి చెందడంతో ఆమె బంధువు పాలెం శేషమ్మ నామినేషన్ దాఖలు చేయగా, ఇతర నామినేషన్లు రాకపోవడంతో ఆ స్థానం కూడా వైఎస్సార్‌సీపీ మద్దతురాలు గెలుపు లాంఛనమైంది. చిగురువాడకు చెందిన నరేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వేమూరి అనురాధ అనే మహిళ వైఎస్సార్ సీపీ మద్దతురాలిగా పోటీలో నిలిచింది. అదే విధంగా పాకాల మండలం పంటపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు రాజేష్ కొన్ని కారణాల వలన తన పదవికి రాజీనామా చేశాడు. దీంతో కాంతారావు రెడ్డి వార్డు సభ్యుడిగా నామినేషన్ దాఖలు చేశాడు. ప్రతిపక్ష పార్టీల నుంచి నామినేషన్లు రాకపోవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



యాగన్నగారి సుప్రియ, తిరుచానూరు 8వ వార్డు



పాలెం శేషమ్మ, పాడిపేట



వేమూరి అనురాధ, చిగురువాడ



కాంతారావు రెడ్డి, పంటపల్లి

సంక్షేమానికే పెద్దపీట

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు సంక్షేమ పథకాలకు జేజేలు కొట్టారు. సర్పంచ్‌తో పాటు వార్డు స్థానాల ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి నామినేషన్లు రాకపోగా వారు సైతం పార్టీలకు అతీతంగా మద్దతు తెలపడంతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో సీఎం వైఎస్ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఎంతగా అభిమానం చాటుకున్నారో మరోసారి రుజువైంది.

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి అభినందనలు



మోహిత్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎంపీపీ మునికృష్ణ, శెట్టిపల్లి పంచాయతీ ప్రజలు

తిరుపతి రూరల్ /తిరుపతి మంగళం: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదివారం ఉదయం పలువురు అభినందించారు. తుమ్మలగుంటలోని ఆయన నివాసం వద్దకు తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ, రాష్ట్ర సాంస్కృతిక అకాడమీ డైరెక్టర్ చిలమంద మునికృష్ణ ఆధ్వర్యంలో శెట్టిపల్లి పంచాయతీకి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మోహిత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. రామచంద్రాపురం మండల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మోహిత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

లేటెస్ట్ టూ వీలర్స్‌పై అవగాహన కల్పిస్తాం



మాట్లాడుతున్న ఎంఆర్.బాషా

తిరుపతి కల్చరల్: లేటెస్ట్ టూ వీలర్స్‌పై మెకానిక్‌లకు అవగాహన కల్పించి వారి జీవనాధారానికి భరోసా కల్పిస్తామని శ్రీబాలాజీ టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్.బాషా, సాయికిరణ్ తెలిపారు. యూత్ హాస్టల్‌లో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్‌ల ఆరోగ్య భద్రత, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వోల్వోలైన్, మొబైల్ ఇంజిన్ ఆయిల్ కంపెనీ వారి చేతుల మీదుగా 110 మంది మెకానిక్‌లకు మెకానికల్ టూల్ కిట్, బెడ్ షీట్, పిల్లో కవర్స్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్ షేక్ సుభాని, వివిధ జిల్లాల ఇన్‌చార్జ్ అధ్యక్షులు సాంబశివరావు, బహదూర్‌ఖాన్, చందు భవాని శంకర్, చాన్‌బాషా పాల్గొన్నారు.

30న కల్యాణ కామేశ్వరి మంత్రహోమం

తిరుపతి కల్చరల్: శ్రీతాత్యయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 30వ తేదీన తొలిసారిగా కల్యాణ కామేశ్వర మంత్ర హోమం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తెలిపారు. ఆయన ఆదివారం కల్యాణ కామేశ్వర మంత్ర హోమం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివాహం కాని వారికి వివాహ శుభ లగ్నం కలిగించేందుకు కల్యాణ కామేశ్వర మంత్ర హోమం చేపట్టడం ఆనవాయితీ అన్నారు. ప్రస్తుతం ఈ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం విజయవాడలోని శ్రీకనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. పరివ్రాజకాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఆశీస్సులతో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాల మేరకు ఆలయంలో ఈ కల్యాణ కామేశ్వర మంత్ర హోమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమం ఇకపై ప్రతి నెలా ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు 30వ తేదీన ఉదయం 9 నుంచి 11.45 గంటల వరకు హోమం జరుగుతుందన్నారు. వివాహం కాని యువతీ యువకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులతో కల్యాణ శుభలగ్నం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.



హోమం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, ఈవో, పాలక మండలి సభ్యులు

వైభవంగా కల్యాణోత్సవం

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాళహస్తి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు ఆలయంలో పలు హోమాలు, అభిషేకం, స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయంలో పూజలు..

శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు దంపతులు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి తదితరులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు రాజేంద్ర, దినేష్ యాదవ్, మునిరాజా పాల్గొన్నారు.

సండే సందడి

ఉద్యోగాల్లో పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు వారాంతంలో భార్యాపిల్లలతో సంతోషంగా గడపాలని అనుకుంటారు. ఆదివారం సెలవు దినం కావడంతో సినిమాలకు, పిక్‌నిక్‌లకు వెళతారు. మరికొందరు ఆలయాలకు వెళతారు. కొందరు సరదాగా పిల్లలతో పార్కులకు వెళ్లి సేదతీరుతారు. ఈ క్రమంలో తిరుపతిలోని ప్రకాశం పార్కు ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించింది. పిల్లలు ఆటలు ఆడుతుండగా వారిని చూసి పెద్దలు ఆనందంగా గడిపారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి













శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: మండలంలోని పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గ్రామ ప్రజలు, నిర్వాహకులు ఆహ్వానించారు. వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6 నుంచి 18వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ గోపాల్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయులు, మణియాదవ్, నాదముని యాదవ్, నాగభూషణం యాదవ్, శ్రీకృష్ణాష్టమి వేడుకల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ గ్రామోత్సవం

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ బాలాలయ మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి పంచలోహ విగ్రహానికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున బాలాలయ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు అవాహిత కలశ పునపూజలు, 3.55 గంటలకు కర్కాటక లగ్నంలో అమ్మవారి దారు ప్రతిష్ఠ, పంచలోహమూర్తి చర ప్రతిష్ఠ, కుంభ కళాన్యాసం, మార్జనలు, నేత్రోన్మీలణం, గో, దర్పణ, కన్యా, సర్వదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



శ్రీమూలస్థాన ఎల్లమ్మపంచలోహ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

మెకానిక్‌లకు హెల్త్ కార్డుల పంపిణీ

తిరుపతి కల్చరల్: ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద 110 మంది మెకానిక్‌లకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. గాంధీభవన్ ఆవరణలో ఆదివారం తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మెకానిక్ సభ్యులకు సుమారు రూ.5 లక్షలు విలువైన ఆరోగ్య బీమా పొందే హెల్త్ కార్డులు అందజేశారు. జీవనాధారం కోసం నూతనంగా మెకానిక్ షాపులు ఏర్పాటు చేసుకున్న 15 మందికి లేబర్ లైసెన్స్‌లు ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి మాట్లాడుతూ మెకానిక్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అసోసియేషన్ అభ్యున్నతికి సభ్యులందరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, బాబు, గురు, సోము, సభ్యులు పాల్గొన్నారు.



మెకానిక్‌లకు హెల్త్ కార్డులు అందజేస్తున్న ఆవుల మునిరెడ్డి

ప్రెస్‌క్లబ్‌లో వైద్య శిబిరం విజయవంతం

తిరుపతి తుడా: తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ కమిటీ నిర్వహించిన వైద్య శిబిరంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ నెల 6వ తేదీన 304 మందికి 42 రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. వాటికి సంబంధించిన రిపోర్ట్‌లను తిరుపతి రుయా, డీబీఆర్ అండ్ ఎస్కే, సంకల్ప, శ్రీసాయి సుధా ఆసుపత్రుల వైద్యులు రవితేజ, అనూష, శివప్రసాద్, గాంధీ, హిమబిందు పరిశీలించి మందులు పంపిణీ చేశారు.

జర్నలిస్టులకు ప్రమాద బీమా

తిరుపతి ప్రెస్‌క్లబ్‌లోని జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కట్టించి వారి భద్రతకు భరోసా కల్పించనున్నట్టు సెక్రటరీ పి.బాలచంద్ర తెలిపారు. వైద్య శిబిరం విజయవంతమైన సందర్భంగా ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. సెక్రటరీ బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రమాద బీమా ప్రీమియంను పూర్తిగా చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రెస్‌క్లబ్‌కు సొంత స్థలం సాధించేందుకు కమిటీ పనిచేస్తోందని చెప్పారు. వైద్య శిబిరం నిర్వహించేందుకు సహకరించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు లావణ్య కుమార్, ద్వారకనాథ్, ఈసీ సభ్యులు వరప్రసాద్‌రావు, లావణ్య కుమార్, సంజీవి సునీల్, పరంధామ రెడ్డి, పూర్వపు కమిటీ సభ్యులు ప్రకాష్ బాబు, పులిగోరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేసుకుంటున్నా జర్నలిస్టులు

వేడుకగా అర్జున తపస్మాన్



తపస్మాన్ ఎక్కుతున్న అర్జున పాత్రధారి

చంద్రగిరి: పట్టణంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ మెట్లు ఎక్కాడు. అక్కడి నుంచి విసిరిన నిమ్మపండ్ల కోసం భక్తులు పోటీ పడ్డారు. పలువురు మహిళలు సంతానం కోసం వరపడ్డారు. అర్జున తపస్మాన్ కార్యక్రమంలో భాగంగా పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు చేగు ప్రశాంత్ గుప్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శీతలపానియాలు అందజేశారు. కార్యక్రమంలో పినపెద్ద విరూపాక్షి శంకర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఉగ్రాణం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న టీం చేగు సభ్యులు

రేణిగుంటలో జాతర సంబరం



రేణిగుంట గంగమ్మ ఆలయం



రేణిగుంటలో విద్యుత్ వెలుగులు



గంగమ్మ తల్లి మూలవిరాట్

రేణిగుంట: మండలకేంద్రం రేణిగుంటలో గంగ జాతర మూడు రోజులపాటు వైభవంగా జరగనుంది. సోమవారం ఉదయం గెరిగె ఊరేగింపు, మంగళవారం గంగమ్మ జాతర మహోత్సవం, గంగమ్మ ఆలయం ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు, నైవేద్యం సమర్పణ, నడివీధి గంగమ్మ ఎదుట అంబళ్లు, అమ్మవారి మూలవిరాట్ విశ్వరూప దర్శనం ఏర్పాట్లు జరగనున్నాయి. బుధవారం నడివీధి గంగమ్మ ఎదుట అమ్మవారి ప్రతిష్ఠ, అమ్మవారి మహాదర్శన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివస్తారు. ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు.

కేకేఆర్ ప్రాపర్టీస్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అచిపిరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, క్రెడాయి ప్రతినిధులు

తిరుపతి సిటీ: మంగళం సమీపంలోని బొమ్మల క్వార్టర్స్ ఎదురుగా ఉన్న అట్లాంటిస్ స్కూల్ సమీపంలోని కేకేఆర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూపొందించిన అలంక్రిత విల్లాస్ బ్రోచర్‌ను ఆదివారం ఆ సంస్థ అధినేత అచిపిరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 67 విల్లాస్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందులో స్విమ్మింగ్ పూల్, జిమ్, క్లబ్‌హౌస్, జాగింగ్ ట్రాక్, టేబుల్ టెన్నిస్, ఇండోర్, అవుట్‌డోర్ ఎమినిటీస్ ఉంటాయని తెలిపారు. ప్రాజెక్ట్ విధివిధానాలకు ఇప్పటికే పబ్లిక్ నుంచి మంచి స్పందన వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధినేతను క్రెడాయి సంస్థ ప్రతినిధులు అభినందించారు.